ఒంటరి ఏనుగు సంచారం

అప్రమత్తంగా ఉండాలని అధికారులహెచ్చరిక

ప్రజాశక్తి -శాంతిపురం : శాంతిపురం మండల పరిధిలోని ఎస్ గొల్లపల్లి కోనేరు కుప్పం గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు నుండి తప్పి పోయిన ఒంటరి ఏనుగు ఉన్నట్టు అందుకున్న సమాచారం మేరకు గ్రామ సమీపం లోని చెరువు ఫారెస్ట్ అధికారులు మళ్లీ దాన్ని అడవిలోకి పంపడానికి ప్రయత్నిస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఒంటరి ఏనుగు కుప్పం మార్గం ద్వారా ఇక్కడికి చేరి ఉంటుందని తెలిపారు. ఉదయం నుండి ఎస్ గొల్లపల్లి కోనేరుకుప్పం గ్రామ పరిసరాల్లోనే ఉన్నట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఒక కారు, ఓ పశువు పై దాడి చేసి గాయ పరిచిందని, పలువురు వ్యక్తులపై దాడికి ప్రయత్నించింది. పరిసర గ్రామస్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా ఏనుగును అరణ్యంలోకి పంపివేస్తామని, లేదా పట్టు కుంటామని తెలిపారు.

అభినందన సభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు

అమలుకు నోచని 'అగ్నిమాపక కేంద్రం'

- ప్రమాదం సంభవిస్తే కుప్పం, పలమనేరుల నుంచి వాహనాలు రాక
- ఆలస్యమైతే అపార నష్టం
- పట్టించుకోని నాయకులు
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి -వి కోట :

మండల కేంద్రమైన వి కోటలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు నాయకుల హామీలకే పరిమితమైంది. సుదూరంలో వున్న కుప్పం నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేలోపు ప్రమాదాల్లో అపార నష్టం సంభవిస్తోంది. ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని నాయకులు ఇచ్చిన హామీ నెరవేరక కలగానే మిగులుతోంది. వచ్చే వేసవిని దృష్టిలో వుంచుకుని తమ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసి అగ్ని ప్రమాదాల నష్టాన్ని నివారించాలని వికోట మండల వాసులు కోరుతున్నారు.

వికోట మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీలు వున్నాయి. ఈ గ్రామాల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. బాధితులు అగ్నిమాపక కేంద్రానికి ఫోను ద్వారా సమాచారం అందించినా సుమారు 40 కిలోమీటర్ల దూరం లోని కుప్పం, పలమనేరు ప్రాంతాల నుండి అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపు జరగాల్సి అపార నష్టం జరిగిపోతూనే ఉంది. మండల కేంద్రమైన వి కోటలో మూడు సినిమా హాల్లు, పలు విద్యాసంస్థలు, సుమారు మూడు కిలోమీటర్ల మేర దుకాణ సముదాయాలు, పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలతో పాటు రెండు జాతీయ రహదారులు అనుసంధానమై ఉన్నాయి. వీటి పరిధిలో అప్పుడప్పుడూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూనే వున్నాయి. దశాబ్దాల కాలంగా స్థానిక ప్రజలు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకై ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. అంతలోపు జరగాల్సిన నష్టం జరిగి బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కస్తూరి నగరం సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే పనులు జరుగుతున్న ప్రాంతంలో టిప్పర్ కు విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. టిప్పర్‌కు నిప్పు అంటుకుంది. విషయం తెలుసుకున్న పలమనేరు అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు అది పూర్తిగా కాలి బూడిదయింది. సుమారు 25 లక్షల రూపాయలు మేర నష్టం వాటిల్లింది. కేజీఎఫ్ మార్గంలో కోళ్ల ఫారంలో నిర్వహిస్తున్న ఫర్నిచర్ కుటీర పరిశ్రమలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో కుప్పం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు ఫర్నిచర్ దుకాణం పూర్తిగా కాలిపోయి సుమారు 20 లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. వీటితో పాటు వేసవి కాలంలో తరచూ గడ్డి వాములు, పూరి గుడిసెలు అగ్నికి ఆహుతి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చుతున్నాయి. వీటి నివారణకు వికోట కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దశాబ్దాల కాలంగా స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న వికోట మండలానికి చెందిన ఎమ్మెల్యే వెంకటేగౌడ, జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు స్పందించి మండల కేంద్రమైన వికోటలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని మాపక వాహనం ఆలస్యమై అగ్నికి ఆహుతి అయిన ఫర్నీచర్ దుకాణం (ఫైల్ ఫోటో)

అంగన్‌వాడీల పోరాటం చారిత్రాత్మక విజయం

- అభినందన సభలో సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- శాంతిపురం: అంగన్‌వాడీల పోరాటం చారిత్రాత్మక విజయమని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు పేర్కొన్నారు. ఆదివారం శాంతిపురం ప్రాజెక్టులో నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎర్రమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు లలిత, జిల్లా గౌరవ అధ్యక్షులు గంగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు చేపట్టిన సమ్మెలో ప్రభుత్వం అనేక నిర్బంధాలకు గురి చేసిన చివరి వరకు పోరాటం కొనసాగడంతో ప్రభుత్వం దిగొచ్చి సమస్యల పరిష్కారానికి అంగీకరించడం అంగన్‌వాడీల చరిత్రలో లిఖించబడ్డ ఘట్టం అన్నారు. సమ్మె కాలంలో ప్రభుత్వం సెంటర్ తాళాలు పగలగొట్టిన, ఎస్మా ప్రయోగించిన, షోకాజ్ నోటీసులు ఇచ్చినా టెర్మినేషన్ చేసిన ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా యూనియన్ ఇచ్చిన పిలుపుని జయప్రదం చేయడం అభినందనీయమని తెలిపారు. 'చలో కలెక్టరేట్ ముట్టడి'లో సమరశీల పోరాటం చేసి అనేక మందికి దెబ్బలు తగిలినప్పటికీ గేట్లు తోసుకొని లోపలికి వెళ్లిన చరిత్ర అంగన్‌వాడీలదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పోరాటం దేశంలో ఉన్న కార్మికులకు ,ఉద్యోగులకు దశ దిశా నిర్దేశించే పోరాటంగా నిలిచిందన్నారు. ప్రాణత్యాగంకి సిద్ధపడి పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగరాక తప్పలేదని తెలిపారు. ప్రధానమైన వేతనాల పెంపు, మినీ సెంటర్‌ను మెయిన్ సెంటర్లకు మార్చడంలో ప్రభుత్వం రాత పూర్వకంగా అగ్రిమెంట్ కు మన పోరాటంతో ప్రభుత్వ మెడలు వంచడం సాధ్యమైందన్నారు. ఇలాంటి విజయం సాధించిన తర్వాత కూడా మన పోరాటాన్ని అబద్ధపు ప్రచారానికి కొంతమంది కొన్ని యూనియన్లు ప్రయత్నాలు చేస్తున్నాయని వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అరచేత్తో సూర్యకాంతి ఆపడం ఎంత అబద్ధమో అబద్ధ ప్రచారం చేయడం కూడా అంతే అబద్ధమని తెలిపారు. శాంతిపురం ప్రాజెక్టు కొత్తదైనా ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో ప్రాజెక్ట్ కమిటీ కీలక పాత్ర పోషించడానికి జిల్లా కమిటీ నుంచి అభినందించారన్నారు. ఈ సమ్మె సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన 13 మంది అంగన్‌వాడీలకు నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ ప్రాజెక్టు కార్యదర్శి శోభ, కోశాధికారి వసంత , నాయకులు మంగమ్మలతో పాటు కుప్పం ప్రాజెక్టు కార్యదర్శి సరళ, గౌరవ అధ్యక్షురాలు ప్రమీల , సీఐటీయూ నాయకులు డేవిడ్ కుమార్ యాదవ్‌తో పాటు అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎస్పీగా జాషువా ఉద్యోగ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి జాషువా

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీగా జాషువా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జాషువా గత 2 సంవత్సరాలుగా కృష్ణా జిల్లా ఎస్పీ గా పనిచేసిన పి జాషువ బదిలీ పై చిత్తూరు జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లా పోలీసు ఉన్నత అధికారులు, సిబ్బంది సాదర ఆహ్వానం పలికారు.ఈ సందర్భం గా జిల్లా పోలీసు ఉన్నత అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు.

అడిషనల్ ఎస్పీగా ఆరిపుల్ల ..

బాధ్యతలు స్వీకరించిన ఎఎస్‌పి ఆరిపుల్లా

జిల్లా అడిషనల్ ఎస్‌పి, అడ్మినిస్ట్రేషన్ గా ఆరిపుల బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా 27 వ అడిషనల్ ఎస్‌పి, అడ్మినిస్ట్రేషన్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. జిల్లా ఎస్‌పి పి.జాషువాని పోలీస్ కార్యా లయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిం చారు. పోలీస్ డిపార్ట్మెంట్ లో ఎస్ఐ గా నియమితులైన ఆరిపుల్ల రాయలసీమ జిల్లా లో పని చేసి సిఐగా ఉద్యోగోన్నతి పొంది కర్నూల్, అనంతపురంలో పని చేసి డిఎస్పీ గా ఉద్యోగోన్నతి పొంది పలమనేరులో డిఎస్పీ గా చేస్తూ అడిషనల్ ఎస్పీ గా ప్రమోషన్ పొంది తిరుపతి జిల్లా ఓఎస్‌డి గా, వైజాగ్ లో ట్రాఫిక్ డిసిపిగా చేస్తూ సాధారణ బదిలీలో చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీస్ అధికారులు, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ అధికారులు, ఏఆర్ అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా అడిషనల్ ఎస్‌పి ని కలిశారు.

డిఎస్పీగా రాజగోపాల్‌రెడ్డి..

డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు సబ్ డివిజనల్ డిఎస్పీగా ఎం రాజగోపాల్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీక రించారు. కర్నూల్ జిల్లా రేవనూరు గ్రామినికి చెందిన ఎం.రాజ గోపాల్ రెడ్డి 1991 బ్యాచ్ లో ఎస్సైగా పోలీసు శాఖలో చేరారు. మొదటి పోస్టింగ్‌లో చిత్తూరు జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ గా పలుచోట్ల పనిచేసిన అనంతరం సిఐ గా ఉద్యోగోన్నతి పొంది చిత్తూరు జిల్లాలోని కుప్పం, వెస్ట్ సర్కిల్, తిరుపతి, నెల్లూరు లో విధులు నిర్వహించి డిఎస్పీ గా రాయలసీమ జిల్లాల్లో ని గూడూరు, నాయుడుపేటలో ఎస్‌డిపిఓ. గా పనిచేసి ఇప్పుడు చిత్తూరు సబ్-డివిజన్ డిఎస్పీ గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్‌పిని, అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి -వి కోట : మండల పరిధిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. వి కోట గ్రామపంచాయతీ పరిధిలోని పాపేపల్లి గ్రామంలో జెడ్పీ నిధులతో చేపట్టిన సిసి రోడ్ పనులను ఆదివారం వారు పరిశీలించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు మంజూరైన అన్ని పనులను ప్రారంభించి పూర్తిచేయాలని ప్రజా ప్రతినిధులకు సూచించారు. మండలంలో సమస్యలు లేని గ్రామాలను నెలకొల్పడమే తన లక్ష్యమని వారు ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు మోహన్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

తిరుమలలో రద్దీ

దర్శనానికి 10 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే సాయంత్రం వరకు శ్రీవారిని 54 వేల మంది భక్తులు దర్శించుకోగా అంతే స్థాయిలో భక్తులు స్వామి వారి దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. భక్తులు అందించిన కానుకలు ద్వారా శ్రీవారికి హుండీకి రూ.3.15కోట్లు ఆదాయం సమకూరింది. స్వామిని దర్శించుకునేందుకు 24 కంపార్టమెంట్లలో భక్తులు నిరీక్షిస్తున్నారు. శ్రీవారి దర్శనానికి పది గంటలు సమయం పడుతోంది. గడిచిన రెండు, మూడు రోజులు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తిరుమల కొండ రద్దీగా మారింది. భక్తులు ఇబ్బందులు పడకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు నీళ్ల సదుపాయంతోపాటు చిన్నారులకు అవసరమైన పాలు అందిస్తున్నారు. మరో రెండు రోజులు భక్తుల రద్దీ కొనసాగే అవకాశముందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.

తిరుపతిలో అంబాజీపేట చిత్ర యూనిట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అంబాజీపేట బ్యాండ్ మేళం చిత్ర యూనిట్ ఆదివారం తిరుపతిలో హల్‌చల్ చేసింది. స్థానిక ప్రతాప్ థియేటర్‌లో చిత్రప్రదర్శనకు విచ్చేసిన సినిమా బృందం అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆ చిత్రం హీరో సుహష్ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ విడుదలైన అంబాజీపేట బ్యాండ్ మేళం చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయానందించడం సంతోషం ఉందన్నారు. చిత్రం విజయ యాత్రలో భాగంగా నేడు తిరుపతికి వచ్చామని, కుటుంబ సమేతంగా చూడదగ్గ ఈ ఫ్యామిలీ సినిమాలు, ప్రతిఒక్కరు చూసి ఆదరించాలన్నారు. సినిమా కథానాయికి శివాని మాట్లాడుతూ తిరుపతిలోని అభిమానుల ఆదరణ ఎన్నటికీ మరవలేనన్నారు. కుటుంబ కథాచిత్రమైన అంబాజీపేట బ్యాండ్ మేళం, నేటి యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చిత్రన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు చిత్ర బృందంతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో ఆ చిత్రం దర్శకులు, నటీనటులు, గ్రూప్ థియేటర్ అధినేత చదలవాడ కృష్ణమూర్తి, సి.కృష్ణ, కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంలోకి అన్య మతస్తులకు స్వాగతం

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: మానవులు ధర్మబద్ధంగా జీవించాలని తెలిపే హిందూ సనాతన ధర్మం ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన మత విశ్వాసమని, ఈ ధర్మాన్ని ఆచరించేందుకు తమకు తాముగా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ఇతర మతాలకు చెందిన వారిని స్వాగతిస్తున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన ధార్మిక సదస్సులో ఛైర్మన్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేయడంలో భాగంగా హిందూధర్మం పట్ల అపారమైన గౌరవం, విశ్వాసం గల అన్య మతాల వారిని ఆహ్వానించేందుకు తిరుమలలో తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ యోచిస్తున్నట్లు చెప్పారు. ఇతర మతాల భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే శ్రీ వేంకటేశ్వరస్వామివారి పాదకమలాల వద్ద హిందూ ఆచారాలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ధార్మిక సదస్సులో పాల్గొన్న పీఠాధిపతులందరూ ఈ విషయాలను అభినందించారు.

మంత్రి కార్యాలయ నిర్వాహకుని హత్యాయత్నం కేసు ఛేదింపు

నిందితులను బహిర్గతం చేసిన పోలీసులు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: తమిళనాడు తిరుత్తణిలో ఈ నెల 2వ తేదీ ఉదయం మంత్రి ఆర్కేరోజా కార్యాలయ కార్యదర్శి ప్రతీష్‌పై జరిగిన హత్యాయత్నం కేసును తిరుత్తణి పోలీసులు ఛేదించారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో కూపీలాగి నగరి మండలం మేళపట్టుకు చెందిన నవీన్ అనే వెట్టునవీన్ (31), నగరి మున్సిపాల్టీ కీళపట్టు బీసీ కాలనీకి చెందిన చిరంజీవి (24), నింద్ర మండలం వైఎన్ కండ్రిగకు చెందిన పరశురాం అనే మధు (39)లను అరెస్ట్ చేశారు. తిరుత్తణి సిఐ మదియరసన్ కథనం మేరకు టీడీపీ యువత అధ్యక్షుడు చిట్టిబాబు వ్యూహ రచన మేరకు మిగిలిన ముగ్గురు పాత్రదారులై హత్యాయత్నానికి ఒడిగట్టారు. నిందితులను కోర్టుకు హాజరుపరచి అక్కడి నుంచి పూయల్ జైలుకు తరలించారు. కాగా అరెస్ట్ అయిన వారిలో నవీన్ అనే వెట్టునవీన్ టీడీపీ యువత ఉపాధ్యక్షునిగా ఉండగా, మిగిలిన ఇరువురు టీడీపీ నాయకులు.

ధార్మిక సదస్సు విజయవంతం

57 మంది పీఠాధిపతులు, మఠాధిపతుల రాక

టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సుకు 57మంది స్వామీజీలను ఆహ్వానించగా అందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుగ్రహభాషణం అందించారని, సదస్సు విజయవంతమైందని టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి తెలిపారు. సదస్సు రెండోరోజు ఆదివారం సాయంత్రం ఈవో మాట్లాడుతూ నభూతో నభవిష్యతి అన్నట్టుగా ధార్మిక సదస్సు జరిగిందన్నారు. ధార్మిక సదస్సుకు స్వామివారి ఆశీస్సులు చక్కగా ఉన్నాయనడంలో సందేహాలు లేదన్నారు. సదస్సులో శనివారం 24 మంది మహనీయులు, ఆదివారం 17 మంది మహనీయలు ప్రత్యక్షంగా, 16 మంది వర్చువల్‌గా తమ సూచనలు, సలహాలు ఇచ్చారని వివరించారు. మఠాధిపతులు, పీఠాధిపతులు తమ కీలక సలహాలు, సూచనలిచ్చి టీటీడీకి దిశానిర్దేశం చేశారని చెప్పారు. మహనీయుల ఉపన్యాసాలను రికార్డ్ చేశామని, వీటిని తీర్మానాలుగా చేసి రేపటి రోజున మఠాధిపతులు, పీఠాధిపతులు సమక్షంలో మీడియా ప్రతినిధుల ముందు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ప్రవేశపెడతారని తెలిపారు. వచ్చే బోర్డు సమావేశంలో వీటిని ఆమోదించి టీటీడీ తదుపరి కార్యాచరణ చేపడుతుందని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

- 'నాడు-నేడు'తో మౌలిక వసతులు
- టెన్త్ పరీక్షలకు 42 రోజులే గడువు
- డీఈవో విజయేంద్రరావు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యా సంవత్సరం ప్రారంభం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నామని, ఇందుకు అనుగుణంగా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేస్తామని, జిల్లాలో ఏర్పాటు చేసిన ప్లస్ టూ పాఠశాలల్లో అర్హత కలిగిన పీజీ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల నియామకం పూర్తి చేశామని డిఈవో పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని గత విద్యా సంవత్సరం కంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఈ మేరకు డివైఈఒలు, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా వారి పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలన్ని బడిలో చేర్పించాలని ఆదేశించామన్నారు. మరో 42 రోజులు అంటే సోమవారం నుండీ మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పదో తరగతి సిలబస్‌ను ప్రారంభించామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు తెలిపారు. 'ప్రజాశక్తి' అడిగిన పలు ప్రశ్నలకు డీఈవో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై వివరించారు.

ప్రశ్న: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాడు-నేడు పనులు ఎలా జరుగుతున్నాయి..?

సమాధానం: నాడు-నేడు మొదటిలో జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం పూర్తి చేశాము. రెండో దశలో ఎంపికైన పాఠశాలల్లో పనులు 90 శాతం పూర్తి చేశాము. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రెండువ దశ పనులు పూర్తి కావాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం.

ప్రశ్న: జగనన్న విద్యా కానుక కిట్లు జిల్లాకు వచ్చాయా..?

సమాధానం: జగనన్న విద్యా కానుక పేరుతో విద్యా సంవత్సరం ప్రారంభం ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, అచ్చు పుస్తకాలు, బ్యాగులు, షూస్ అదించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జిల్లాకు మొదటి విడత జగనన్న విద్యా కానుక కిట్లు వచ్చాయి. వీటిని డివైఈఒ పాయింట్లలో ఉంచాం.. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొతర ఉందా..?

సమాధానం: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదు. ఇటీవల గతంలో అగిపోయిన డిఎస్‌సి అభ్యర్థులను విధుల్లోకి తీసుకొని జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చాము. ఎంఈఒల భర్తీ పూర్తి చేశాం. విద్యార్థుల సంఖ్యను బట్టి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొతర లేకుండా ఉపాధ్యాయులను నియమించాం.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందా..?

సమాధానం: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాల పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థిని విద్యార్థులను గుర్తించాం. పిల్లల తల్లిదండ్రులకు నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాలయాలపై అవగాహన కల్పించాం. గత ఏడాదిలో ప్రయి వేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరే అవకాశముంది. మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ గత ఏడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.



మాట్లాడుతన్న డీఈవో విజయేంద్రరావు

టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బీసీ' సభ

ప్రజాశక్తి - పలమనేరు: టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బీసీ' సభను ఆదివారం నిర్వహించారు. పలమనేరు పట్టణంలోని మార్కెట్ కమిటీ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ప్రారంభమై స్థానిక పార్టీ కార్యాలయం వరకు సాగింది. అనంతరం జరిగిన బహిరంగ సభకు మాజీ మంత్రి ఎన్ అమరనాథ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ పాలనలో అన్ని రంగాలలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సభలో బిసి సంఘ నేతలు కార్యకర్తలు, సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

'తహశీల్దారు ఇన్బనాథన్ సేవలు భేష్'

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: రెవెన్యూ పరంగా వివిధ వర్గాల ప్రజలకు తహశీల్దారు ఇన్బనాథన్ చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిన్నమరెడ్డి, బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఇన్బనాధన్‌కు ఆదివారం పలువురు అధికారులు, నేతలు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు విజయ సింహారెడ్డి, సింగిల్ విండో ఉపాధ్యక్షులు నరసింహులు నాయుడు, మండల మాజీ వైసీపీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, డీటీ తులసిరామ్, ఎలక్షన్ డీటీ విజయక్రిష్ణ, ఆర్ఐ దేవి, పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని చిక్కపల్లి తండా పంచాయతీ టిడిపి మహిళా నేత సుమిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం టిడిపి నేతలు, కార్యకర్తలు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి టిడిపి తరపున పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, మాజి అధ్యక్షుడు ఆంజనేయులు రెడ్డి, చలపతి, కృష్ణా నాయక్ బాలాజీ నాయక్, చంద్రకళ, నందా రెడ్డి, టీవీ రవి ,జేశు, భూపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-సత్యవేడు: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేసి చికిత్స చేస్తారన్నారు. కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఓజిలి ఎస్ఐగా రవిబాబు

ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి నూతన ఎస్ఐగా పి.రవిబాబు ఆది వారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మం డలంలోని శాంతిభద్రతల పర్యేవేక్షణకు కృషి చేస్తామన్నారు.

నేత్ర శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: మండలంలోని గోవర్ధనపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో డైనమిక్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంనకు సుమారు 70మంది ప్రజలు పాల్గొని చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో వెంకటముని, డాక్టర్ అరవింద్, సుబ్రమణ్యం, రామసుబ్బయ్య, గుణవర్ధన్, మోహన్‌రావు, గోపి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

'ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి'

ప్రజాశక్తి-గూడూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. మండలం సిద్దమ్మకండ్రిగ గ్రామంలో ఆదివారం జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, ఇంద్రవర్ధన్, అంకయ్య, కోటయ్య, పరశురామ్, కోటయ్య, శ్రీనాథ్, మాతయ్య, శ్రీనివాసులు, రాము, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ నేత పుట్టినరోజు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణానికి చెందిన వైసీపీ నేత హాషీమ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని కరణాల వీధిలోని వైసీపీ నేత శివకుమార్‌రెడ్డి నివాసంలో 'స్వచ్ఛ ఆంధ్ర సంస్థ ఛైర్మన్ పొనకా దేవసేనమ్మ, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజును నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోదండరామయ్య, వాసు, అజీజ్ ఖాన్, ముని, సాయి, అహ్మద్ బాషా, అల్తాఫ్, విజయ్, చిన్నా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏసు మృతికి నివాళి

ప్రజాశక్తి-పిచ్చాటూరు: పిచ్చాటూరు దళితవాడకు చెందిన ఏసు(53) ఆరోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హలిమలో పనిచేస్తున్న యేసు కుటుంబానికి ప్రభుత్వ తరపున జిల్లా కలెక్టర్ ద్వారా న్యాయం చేస్తానని భరోసా కల్పించారు.

హైడ్రో జెల్ వినియోగంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ఓజిలి: హైడ్రో జెల్ వినియోగంపై రైతులకు ఉద్యాన శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆతక్తి) అవగాహన కల్పించారు. ఆర్మీని పాడు రైతు భరోసా కేంద్రం వద్ద హైడ్రోజెల్ వినియోగంపై ప్రదర్శనా క్షేత్రం ఏర్పాటు చేసి రైతులకు వర్మీ కంపోస్ట్ ట్రైకోడెరా వీరిడి, హైద్రిజెల్‌ను ఉచితంగా సరఫరా చేసి మొక్కలకు ఎలా వాడాలో అవగాహన కల్పించారు. దీని వలన మొక్కలకు తక్కువ నీటి తడులు అవసరం అవుతాయని, కరువు పరిస్థితులలో నీటి ఎద్దడిని మొక్కలు తట్టుకుంటాయని తెలిపారు. పి.డి సత్యవాణి, శివనారాయణ, శారద, వంశి పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు నోబెల్ వరల్డ్ రికార్డ్‌లో చోటు

ప్రజాశక్తి-గూడూరు టౌన్:
గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి యోగ విభాగంలో నోబెల్ వరల్డ్ రికార్డ్ సృష్టించినట్లు వసంత యోగ అకాడమీ నిర్వాహకురాలు వసంతలక్ష్మి మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన తమ అకాడమీ ఆధ్వర్యంలో గత సంవత్సరం నవంబర్‌లో ఆన్లైన్లో నిర్వహించిన యోగా పోటీలలో పట్టణానికి చెందిన సంధ్యారాణి సూర్య నమస్కారాలు విభాగంలో నోబెల్ రికార్డు సాధించారని తెలిపారు. సూర్య నమస్కారాలు నాన్‌స్టాప్‌గా 108సార్లు అతి తక్కువ సమయంలో చేయడంతో ఆమె నోబెల్ వరల్డ్ రికార్డ్ సృష్టించినట్లు న్యూఢిల్లీకి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు ప్రకటించారని తెలిపారు.

'విద్యార్థులు దేశానికి ఉపయోగపడాలి'

ప్రజాశక్తి-రేణిగుంట: విద్యార్థులు భవిష్యత్తులో భారతదేశానికి ఉపయోగపడేలా తయారవ్వాలని తిరుపతి ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాలలో లర్నింగ్ ఉత్సవ్‌ను ఆ పాఠశాల అధినేత విక్రమ్‌శాలి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొని ఉత్సవ్‌ను ప్రారంభించి మాట్లాడారు. చిన్నారులు ప్రదర్శించిన ప్రయోగాత్మక పరికరాలు చాలా బాగున్నాయని అభినందించారు. భారతదేశానికి విద్యార్థులు భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా తయారవ్వాలని అందుకు అనేక భాషలు నేర్చుకోవాలని సూచించారు. విక్రమ్ శాలి మాట్లాడుతూ 500మంది విద్యార్థులు 250ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచడం విశేషమని కొనియాడారు. చదువులో తమ పాఠశాల విద్యార్థులు ఎల్లప్పుడూ ముందు ఉంటారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల డైరెక్టర్ అనూషకు అభినందనలు తెలిపారు.

ధరలు పెంచడం దుర్మార్గం: గాలి భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వైసీపీ ప్రభుత్వం కరెంటు, విద్యుత్, డీజల్ ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెట్టడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిందని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విమర్శించారు. మున్సిపాలిటీలోని 19 వార్డులో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి మిని మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చెంచ య్య. జీవరత్నంనాయుడు. ధనపాల్, మాధవయ్య. యుగంధర్, గోపి, చిన్నబాబు, వేలు పాల్గొన్నారు.

కయ్యూరుకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:
తొట్టంబేడు మండలం పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ళు విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై దిగువ సాంబయ్యపాళెం పాఠశాలకి బదిలీపై వెళ్ళిన కయ్యూరు బాలసుబ్రమణ్యంను ఆదివారం పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నతికి బాలసుబ్రమణ్యం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఇన్నేళ్ళు తనపై ఆదరాభిమానాలు చూపించిన గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు బాలసుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దినకర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచని రహదారి

- దశాబ్దాలు గడిచినా మారని దారి
- వాహన చోదకులు, రైతులకు ఇక్కట్లు

ప్రజాశక్తి- గంగవరం: మండల పరిధిలోని నాలుగవ జాతీయ రహదారి నుండి కీలపల్లి బాలేపల్లి మీదుగా పుంగనూరు- బైరెడ్డిపల్లి రహదారిని కలిపే రహదారి దశాబ్దాలైన మరమ్మతులు నోచుకోకపోవడంతో ఈ గ్రామాల రైతులు, ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం టిడిపి హయాంలో ఈ దారికి నాలుగు కోట్ల 90 లక్షల రూపాయల నిధుల మంజూరయ్యాయి. మట్టి పనులు, కంకర నింపి అలాగే వదిలేయడంతో రైతులు పండించిన పంటలు మార్కెట్ కి తీసుకు వెళ్లడానికి, ఈ గ్రామాల నుండి రహదారులకు వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన రహదారి కావడంతో అప్పటి కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో వారు పనులను అర్థాంతరంగా వదిలిపెట్టి వెళ్లిపోయారని, అనేకసార్లు ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించినా పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొంటున్నారు. 'గడప గడప వైయస్సార్'లో భాగంగా ఈ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేలు సైతం దీన్ని పట్టించుకోలేదని ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు, ఇతర ప్రాంతాలలో బతుకు తెరువు కోసం వెళ్లే కూలీలు, చిరు ఉద్యోగులు రాత్రి వేళల్లో జాతీయ రహదారి నుండి రావడానికి నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రోడ్డుకు మరమ్మతులు చేసి తమ గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఈ గ్రామంలో గతంలో ఇద్దరు మండలాధ్యక్షులుగా పదవులు చేపట్టారు. అయినా ఈ రహదారి పూర్తి కాలేదు. అసంపూర్తిగా వుండడంతో ప్రజలు, రైతులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. నాయకులు, అధికారులు స్పందించి రోడ్డును పూర్తి చేసి స్థానికులకు మేలు చేయాలని పలువురు కోరుతున్నారు.

కంకర తేలిన రహదారి

చంద్రబాబు సభకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం రామానాయుడు పల్లె వద్ద ఈనెల 6వ తేదీ 'టిడిపి రా ..కదలిరా..' కార్యక్రమం సభా వేదిక పనులు దాదాపు పూర్తి అయ్యాయి. బహిరంగ సభకు సమీపంలో మాజీ సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో దిగడానికి హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యే విధంగా చిత్తూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని, మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్‌లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్టిబాబు నాయుడు సభా ప్రాంగణాన్ని ఆదివారం పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు.

సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం మండలం ఆర్ కెవిబి పేట గ్రామానికి చెందిన మారుసాని గోవర్ధన్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించడంతో కార్వేటినగరం మండల అధ్యక్షుడు దినకరప్రసాద్ ఆధ్వర్యంలో కోనేరు వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నిబంధనలకు కట్టుబడి ఉంటానని తెలిపారు. అనంతరం తన పదవికి కృషి చేసిన జిల్లా రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు గౌతం, స్టేట్ కిసాన్ సెల్ అధికార ప్రతినిధి బండ్ల సుబ్బరాయులు, జిల్లా సెక్రటరీ నాధముని, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మారుసాని గోవర్ధన్ రెడ్డి సన్మానిస్తున్న దృశ్యం

తహశీల్దారుకు సన్మానం

పజాశక్తి -వి కోట : ఇటీవల బదిలీపై వెళ్లిన తహశీల్దారు చిట్టిబాబును మండల రెవెన్యూ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దారు బాలాజీ రావు ఆర్ఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తక్కువ కాలంలో మండలంలోని రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు తహశీల్దారు చూపిన చొరవను కొనియాడారు. సన్మాన గ్రహీత చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని తక్కువ సమయంలో మండలంలోని ప్రజాప్రతినిధులు రెవెన్యూ సిబ్బంది సహకారంతో కొంతమేర సమస్యల పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేశానని తెలిపారు. మండల తహశీల్దారుగా విధి నిర్వహణలో వివాదాలకు దూరంగా ఉంటూ సమస్యలపై దృష్టి సారించి బదిలీపై వెళ్లిన తహశీల్దారు కు పుర ప్రముఖులు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు , ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

తహశీల్దారు చిట్టిబాబును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి

ప్రజాశక్తి - రామకుప్పం: గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని వీర్నమల పంచాయతీలో గ్రామ వికాస సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర సంవత్సరంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయకత్వంలోనే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దాడులు, అక్రమ కేసులతో ప్రజలు విసిగిపోయారన్నారు. 1989లో గ్రామాన తారు రోడ్డు నిర్మాణాలు టిడిపి తోనే జరిగిందన్నారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా అందించారు. నిరుపేదలకు ఇల్లు స్థలాలు, నిర్మాణాలు, బ్యాంకు రుణాలు అందించిన ఆర్థిక అభివృద్ధి చేసిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు చలపతి ,కృష్ణా నాయక్, నారాయణ చారి, కామరాజు నాయక్, నందా రెడ్డి, టీవీ రవి, మురళి, రఘు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

'వైసిపిలో చేరింది జనసైనికులు కాదు'

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : ఎంసి విజయానందరెడ్డి సమక్షంలో చేరిన యువకులు తమ పార్టీ వారు కాదని జనసేన నాయకులు శ్రీరామ్ లోచన్ తెలిపారు. ఆదివారం స్థానిక కింగ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపు సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. జనసేన కార్యకర్తలు వైసీపీలో చేరుతున్నారంటూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు.. యువతను తమ పార్టీలో చేర్చుకుంటున్న వైసిపి నాయకులు వారి ఉపాధి అభివద్ధి కోసం కషి చేయాలని సూచించారు. వైసిపిలు జనసేన యువకులను చేర్చుకోవడం చూస్తే జనసేన అంటే వైసిపి భయపడుతోందని స్పష్టమవుతోందన్నారు. తమ పార్టీ నుండి వైసిపిలో చేరిన యువకులు జనసేన అని నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో 31,32 వ డివిజన్ ఇన్‌ఛార్జిలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

చరిత్రలో నిలిచి పోనున్న చంద్రబాబు సభ

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం రామానాయుడు పల్లె వద్ద ఈనెల 6వ తేదీ జరగనున్న టిడిపి రా కదలిరా సభా కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారని ఈ సభ రాష్ట్ర స్థాయిలో చిరస్థాయిగా నిలుస్తుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైసిపి వ్యతిరేక విధానాల వల్ల యువకులు విద్యార్థులు రైతులు మహిళలు వ్యాపారస్తులతో పాటు బడుగు, బలహీన వర్గాలు లక్ష మందికి పైగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పులివర్తి నాని, గంగాధర నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ , తో పాటు మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

షేక్ అబ్దుల్ రజాక్‌కు 'యువ వైభవ సేవ ముత్యం' అవార్డు

ప్రజాశక్తి-రేణిగుంట:
సర్ సి.వి రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం 28వ సంవత్సర ఉగాది మహోత్సవ స్వర్ణ కంకణ అవార్డు సంబరాలను ఆదివారం ఎస్వీయూ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రేణిగుంట ఎంఏ జబ్బార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, సతీమణి సేవ పురస్కార అవార్డు గ్రహీత షేక్ హసీనాబాను, బుల్లి మనవడును తాత అడుగుజాడల్లో అడుగులు వేపిస్తూ గత కొద్ది నెలలుగా సేవలలో పాల్గొంటున్న షేక్ అబ్దుల్ రజాక్, (షేక్ ఏ హాన్) కు ప్రత్యేక ఆహ్వానం అందించి డాక్టర్ షేక్ ఫరీద్ బాబాకు, సేవ వైభవ భూషణ్, షేక్ హసీనా భాను కు మహిళా సేవ శిరోమణి, మొట్టమొదటి సారి అవార్డు అందుకుంటున్న ముద్దుల మనవడు అబ్దుల్ రజాక్ (షేక్ ఏహాన్)కు యువ వైభవ సేవ ముత్యం అవార్డులను అత్యంత వైభవంగా పలువురు ముఖ్య విశిష్టత అతిధుల మహారాజులచే అందజేశారు.



రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు

టిడిపి నాయకులు చల్లా రామచంద్రారెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి -పుంగనూరు: వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అప్పులు చేసి అభివృద్ధి లేకపోయినా రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. పుంగనూరు మున్సిపాలిటీలో వార్డుబాట కార్యక్రమాన్ని ఆదివారం హనుమంతురాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి వ్యవస్థలను సర్వ నాశనం చేసిందని ఆరోపించారు. అటు రాష్ట్రంలో కానీ ఇటు పుంగనూరు నియోజకవర్గంలో కానీ కక్ష సాధింపులు కేసులు పెట్టడం, జైలుకు పంపించడం కార్యక్రమాలు తప్పితే మరి ఎలాంటి అభివృద్ధి లేదని అన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో అయితే పరిస్థితులు మరి దారుణంగా ఉన్నాయని ఇక్కడి ప్రజలు ఇలాంటి దౌర్జన్యాలు ఎప్పుడు చూసి ఉండరన్నారు. ప్రశాంతతకు మారుపేరైన పుంగనూరు మూడు పర్యాయాలు అధికారాన్ని ఇచ్చి చూశారని ఇకనైనా చేసిన అరాచకాన్ని అందరూ గమనిం చారని మంచికి, అభివృద్ధి చేసే వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. అన్ని వార్డులు తిరిగి ప్రజలను కలిసి టిడిపి గెలుపునకు సహకరించాలని కోరుతానన్నారు. ఈ సందర్భంగా హనుమంతురాయి బీడీ కాలనీ, ప్రకాశం కాలనీ, రామ్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను కలిశారు. టిడిపి చేపట్టిన వార్డుబాట కార్యక్రమానికి జనసేన నాయకులు మద్దతు తెలుపుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేశాధి ప్రకాష్, శ్రీకాంత్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కుమార్, సివి రెడ్డి, పోలీస్ గిరి, మాధవ రెడ్డి, న్యాయవాది వెంకటముని, సుహేర్ బాష, సద్దాం, సుధాకర్ పాల్గొన్నారు.

వైసీపీ నుండి టిడిపిలో చేరిక

వైసిపి నుండి టిడిపిలోకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వార్డు బాట కార్యక్రమం సందర్భంగా హనుమంతరావు 10 కుటుంబాలకు చెందిన వైసిపి వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.


వైసీపీ నుంచి టిడిపిలో చేరిన నాయకులు

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్
గుర్తు తెలియని వ్యక్తి దాడిచేయడంతో తీవ్రగాయాలపాలై వ్యక్తి మృతిచెందిన సంఘటన మున్సిపల్ పరిధి కీళపట్టులో చోటుచేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు కీళపట్టులో వాటర్‌ప్లాంటు నిర్వహించే జగదీష్ (30) అనే వ్యక్తి ఇంటికి వెళ్లి శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి దాడిచేశాడు. దాడితో తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యచికిత్స అందించారు. ఉన్నత వైద్యసేవల నిమిత్తం తిరుపతికి తరలిస్తుండా మరణించాడు. మృతుని తల్లి వసుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కాగా మృతుడు జనవరిలో మొదటి వారంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి తనకు బెదిరింపు కాల్స్ వస్తుందంటూ ఫిర్యాదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు. దీంతో ఆ బెదిరింపు కాల్స్ ఆధారంగా విచారణ చేపట్టారు. అయితే గ్రామంలోని ప్రజలు మృతునికి మరో వివాహితతో సంబంధం ఉందని ఆ విషయంగా పలుమార్లు గొడవలు జరగడం, పంచాయితీలు పెట్టారని తెలుపుతుండటంతో ఆ కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-బాలాయపల్లి
కోడి పందెం రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వేటూరి బ్రహ్మనాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని కొత్తూరు రోడ్డు కోటంబేడు వద్ద స్థావరాలపై దాడులు చేశామన్నారు. 6కోళ్లు, 35 బైక్‌లు మరి కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ
అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాపట్లకు చెందిన భార్గవ అనే వ్యక్తి మద్యం తరలిస్తున్న అందిన సమాచారంతో దాడి చేశామన్నారు. అతని నుంచి 12 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

మహిళా జట్టును అభినందిస్తున్న దృశ్యం

వాలీబాల్ జట్టుకు అభినందనలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం
ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో బోడబండ్ల గ్రామానికి చెందిన మహిళల వాలీబాల్ జట్టు మండల స్థాయిలో మొదటి స్థానం నిలవగా నియోజకవర్గస్థాయిలో మొదటి స్థానం నిలిచి జిల్లాస్థాయిలో రెండవ స్థానం కైవసం చేసుకున్నందుకు ఆదివారం బోడబండ్ల మహిళా వాలీబాల్ జట్టు గ్రామ యువత కోదండరాముల ఆలయం వద్ద గెలుపొందిన మహిళా జట్టును దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి అభినందన తెలిపారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన బోడబండ్ల మహిళలు క్రీడా పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుపొంది గ్రామానికి జిల్లాలోని పేరు ప్రతిష్టలు తెచ్చారన్నారు. మారుమూల ప్రాంతంలో గల క్రీడాకారులను గుర్తించేందుకు 'ఆడుదాంఆంధ్ర' కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు నరసింహులు, పట్టాభి, గిరి, జగదీష్ యాదవ్, మోహన్, చిరంజీవి, జ్యోతిశ్వర నాయుడు, గోపి నాయుడు, ఉదయ్, గోవి, హరికృష్ణ, గుణ, దినేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి)
అకుతోట వీదికి చెందిన డి.ధనమ్మ(80) చుట్టు గుడిసె ఆదివారం విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన మంటలు అర్పటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అయినప్పటికీ చుట్టు గుడెసె పూర్తిగా కాలిపోయింది నష్టం కలిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ధనమ్మకు చెందిన ఇంటి సామాన్లు బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ధనమ్మ నాలుగిళ్లలో పాచి పనులు చేసుకుంటూ ఒంటరిగా ఆ గుడిసెలో జీవనం సాగిస్తుండేది. ఆసరాగా ఉండిన గుడిసె కాలిపోవటంతో ధనమ్మ వీధిపాలైంది. ప్రభుత్వం స్పందించి ధనమ్మను ఆదుకోవాలని పలువురు కోరారు.

'నారాయణస్వామి వద్దయ్యా..!'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
'జీడి నెల్లూరు నియోజకవర్గ ఎంఎల్ఏ స్థానం నారాయణస్వామికి ఇవ్వదని వైసిపి జీడి నెల్లూరు దళిత నాయకులు దేవరాజులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థపరుడైన నారాయణస్వామి మూడు సార్లు ఎంఎల్ఏగా ఓ సారి డిప్యూటి సిఎంగా పన చేసినా నియోజకవర్గ ప్రజలకు మేలు చేయలేదన్నారు. రిజర్వేషన్ కోటాలో ఎంఎల్ఏ అయిన వ్యక్తి దళితుల అభివృద్ధికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. ఎంఎల్ఏ స్థానం కోసం జడ్జి పోస్టును వదులుకున్న దొరస్వామికి అవకాశం కల్పించాలన్నారు. వైసిపి నారాయణస్వామికి టికెట్ ఇస్తే ఖచ్చితంగా ఓడించి తీరుతామన్నారు. జీడి నెల్లూరు దళితులు నారాయణ స్వామిపై ఆగ్రహం గా ఉన్నా రని రానున్న ఎన్నికల్లో ఆయన ఓటమి చెందడం ఖాయమన్నారు. మ రో మారు ఆలోచించి నారాయణస్వామిని మార్చాలన్నారు.

కుక్కల బెడద ఆగేదెప్పుడో..?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్
వడమాల పేట మండలంలోని. ఎస్‌బిఆర్ పురం గ్రామ పంచాయతీలో కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సుమారు గ్రామంలో 500కు పైగా కుక్కలు తిరుగుతున్నాయి. ఇవి పగలు, రాత్రి తేడా లేకుండా మనుషులు, వాహన చోదకులు, పిల్లలు, వృద్ధుల వెంట పడి తరుముతున్నాయి. ఈ కారణంగా గ్రామంలోని వీధుల్లో నడిచి వెళ్లాలన్నా భయం గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిల్

కుక్కలు అధికంగా వున్న ప్రదేశాల్లో సంబంధిత వైద్యుల పర్యవేక్షణలో కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేసి కుక్కల బెడదను నివారించాల్సి వుంది. అయితే గ్రామాధికారులు ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఎస్‌బిఆర్ పురంలో వీధుల్లో మనుషుల కన్నా కుక్కలు అధికంగా కనిపిస్తు న్నాయి. ఇవి రాత్రి వేళల్లో మనుషుల వెంట పడి తరుము కుంటున్నాయని, పిల్లలు, వృద్ధులు, మహిళలు కుక్క కాట్ల బారిన పడి ఆందోళనకు గురవు తున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

తమకు కుక్కల బెడద అధికంగా వుందని గతంలోసంబంధిత అధికారు లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.